# మిషన్ భగీరథ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు
- బీజేపీ ఆధ్వర్యంలో పాల్వంచ మున్సిపల్ మేనేజర్‌కి వినతి



కొత్తగూడెం, జూలై09(కెరటం ప్రతినిధి)

మిషన్ భగీరథ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పాల్వంచ మున్సిపల్ మేనేజర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులలో గత ప్రభుత్వం ఇంటింటికి మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో మిషన్ భగీరథ అనే పథకంతో ప్రతి ఇంటికి పైపులైన్ వేసే పనిని చేపట్టిందన్నారు. ఇట్టి ప్రాజెక్టును దక్కించుకున్న కాంట్రాక్టర్ మిషన్ భగీరథ పైప్ లైన్ వేసే క్రమంలో సీసీ రోడ్డు త్రవ్వి పైపులైన్ వేసిన తర్వాత మరల త్రవ్విన సీసీ రోడ్డును యధావిధిగా పూడ్చాల్సి ఉంది కానీ పాల్వంచలోని అన్ని ప్రాంతాలలో మిషన్ భగీరథ ద్వారా పనిచేసిన సదురు కాంట్రాక్టర్ ఎక్కడ కూడా తవ్విన సీసీ రోడ్డును యధావిధిగా పూడ్చలేదన్నారు. పైపులైన్ వేసే క్రమంలో గత సంవత్సర కాలంలో నూతనంగా వేసిన సీసీ రోడ్లు కూడ త్రొవ్వి అలానే వదిలేసినారన్నారు. రోడ్లు తొవ్వటం వలన అనేక ఇబ్బందులు కలుగుతున్నాయి ముఖ్యంగా ద్విచక్ర వాహనాదారులు పైపులైను కోసం త్రవ్విన గుంటల వలన క్రింద పడుతున్నారని, మున్సిపాలిటీ కోట్ల రూపాయలు వెచ్చించి సీ సీ రోడ్లు నిర్మిస్తే వాటిని మిషన్ భగీరథ ప్రాజెక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ వారి పని కోసం రోడ్డును అడ్డంగా త్రవ్వి మళ్ళి పూడ్చట్లేదు కనుక తక్షణమే మిషన్ భగీరథ కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని పాల్వంచలోని 24 వార్డుల్లో మిషన్ భగీరథ పనిలో భాగంగా పాడైపోయిన రోడ్లన్నీ తక్షణమే మరమత్తు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బిజ్జం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కేసగాని శ్రీనివాస్, పాల్వంచ పట్టణ ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, పట్టణ ప్రధాన కార్యదర్శి మాదారపు లక్ష్మణ్, బియ్యని విజయ్ తదితరులు పాల్గొన్నారు.









## నూకల రంగారావు ఇంట తేనేటి విందుకు విచ్చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కొత్తగూడెం, జూలై09(కెరటం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంగళవారం పర్యటించారు. దీనిలో భాగంగా వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పాల్వంచ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూకల రంగారావు ఆహ్వానం మేరకు పాల్వంచలోని ఆయన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన తేనీటి విందుకు వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించారు. పార్టీలో ఆది నుంచి కష్టపడుతూ పాల్వంచలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నూకల రంగారావు చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు. పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం దక్కుతుందని, నూకల రంగారావు సేవలను కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా గుర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా కాల్వ సుజాత

### అభినందనలు తెలిపిన దారా రమేష్



కొత్తగూడెం, జూలై09(కెరటం ప్రతినిధి)

ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా తాండూరుకు చెందిన కాల్వ సుజాతను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించడం పట్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు దారా రమేష్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు దారా రమేష్ మాట్లాడుతూ.. కామారెడ్డి సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తొలిసారి నూతనంగా ఆర్య వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న నిరుపేద ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆర్య వైశ్య కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు నిధులు మంజూరు చేయించి విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు కృషి చేయాలని కోరారు.